



గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్



సభకు హాజరైన ప్రజలు



చంద్రవంచ గ్రామస్థులకు రైతు భరోసా చెక్కును అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

కాంగ్రెస్‌తోనే.. రైతు రాజ్యం

- రుణమాఫీ, ఉచిత విద్యుత్, బకాయిలు, కేసుల రద్దు కాంగ్రెస్ ఘనత
- విత్తనానికి భూమికి ఉన్న బంధమే.. కాంగ్రెస్‌కు రైతులకు మధ్య ఉంది
- అండగా ఉండండి.. ఎవరడ్డం వచ్చినా తొలగించుకుని అభివృద్ధి చేస్తా..
- పదేళ్లుగా పీఆర్ఎల్ఐ పూర్తి చేయలే, 'పేట' ఎత్తిపోతలను పట్టించుకోలే..
- పాలమూరులోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చూపిస్తా
- ప్రజా ప్రభుత్వంలో ప్రజలే రాజులు.. వారి వద్దకే వెళ్లేలా విధాన మార్పు
- కొడంగల్‌ది 70 ఏళ్ల వెనుకబాటు.. ఇప్పుడు కూడా కాళ్లలో కట్టెలు పెట్టొద్దు
- అధికారులకు అన్ని వివరాలు చెప్పండి.. చిల్లరగాళ్లతో గందరగోళం వద్దు
- నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు, ఆత్మీయ భరోసా పథకాలకు శ్రీకారం

మహబూబ్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం సాధ్యమవుతుందని, రుణమాఫీ, ఉచిత విద్యుత్ బకాయిలు, కేసులను ఒక్క కలం పోటుతో రద్దు చేసి.. దండగ అనుకున్న వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘతన కాంగ్రెస్‌దేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. విత్తనానికి భూమికి ఉన్న బంధమే.. కాంగ్రెస్‌కు, రైతులకు మధ్య ఉందని స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు, ఆత్మీయ భరోసా పథకాల ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వంతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొడంగల్ ప్రాంతం వెనుకబాటులోనే ఉందన్నారు. 2023 నుంచి ఈ ప్రాంతానికి రాష్ట్రానికే ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇక్కడ పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్నా.. ఇంజనీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్ విద్య అందించాలన్నా.. పాలమూరు- రంగారెడ్డి, నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల ద్వారా నీరందించాలన్నా.. కాళ్లలో కట్టెలు పెడుతున్నారని, తమ వాళ్లు బస్టాండ్లు, చౌరస్తాల్లో ఉపాధి లేక ఖాళీగానే ఉండాలని కోరుకుంటున్నారని ఆవేదన చెందారు. తాను ఈ నియోజకవర్గంలో ఒక్క రూపాయి ఎవరినీ అడగలేదని, బస్ డిపో కోసం, సబ్ స్టేషన్ల కోసం, పాఠశాలల కోసం, పిల్లల చదువుల కోసం దానాలు చేశామన్నారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి ఎంత దోచుకున్నాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. తాను రాష్ట్రంలో తిరుగుతుంటే, ప్రజలకు తన సోదరుడు అందుబాటులో ఉంటే.. ఏం పదవి ఉందని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారని, ప్రజాసేవ కోసం పదవులు.. వారిలా ఇంటిల్లిపాదికి అవసరం లేదని ఎద్దేవా చేశారు. తనకు ఈ నియోజకవర్గ ప్రజలు 2009 నుంచి అండగా ఉంటున్నారని, వారి ఆశీర్వాదంతోనే ఈ రోజు రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చిందన్నారు. ఏళ్ల తర్వాత వచ్చిన అవకాశం కాబట్టి.. ప్రజలంతా ఇలాగే అండగా ఉండాలని కోరారు. చిల్లరగాళ్ల మాటలు నమ్మి గందరగోళానికి గురికావొద్దని సూచించారు. ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాల్సి వచ్చేదని.. ప్రజా ప్రభుత్వంలో ప్రజలే రాజులు కాబట్టి.. వారి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాల కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలకు పథకాలు

(మిగతా 4లో)



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

సబ్బండ వర్గాల సహకారంతో.. ప్రజాపాలన

- విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు పెద్దపీట
- మహాత్మాగాంధీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు
- ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- 76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సబ్బండ వర్గాల సహకారంతో జిల్లాలో ప్రజాపాలనను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ స్పష్టం చేశారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తున్నామని, అన్నివర్గాల ప్రజలకు సామాజిక న్యాయం సమాన అవకాశాలు దక్కే విధంగా సమష్టి కృషిని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జిల్లా పురోభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అందిస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోందని చెప్పారు.



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆరు గ్యారెంటీలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా పథకం కింద జిల్లాలో మూడు లక్షల 22వేల మంది రైతులకు సంబంధించి ఏడు లక్షల 39వేల ఎకరాలకు, ఎకరానికి ఆరువేల చొప్పున రూ.444కోట్లు ఆదివారం అర్ధరాత్రి వారి ఖాతాల్లో జమ చేయడం

(మిగతా 6లో..)



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పసుపుల గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

కోడేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందాలని, పథకాల అమలు పారదర్శకంగా జరగాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని పసుపుల గ్రామంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల తరువాత గ్రామ సభలలోనే నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నేరుగా అందిస్తుందన్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అమలు మంజూరు పత్రాలను అందజేశారు. అంతకు ముందు మంత్రి గ్రామంలో పర్యటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ఏడాది కాలంలోనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. సంక్షేమ పథకాల కోసం పైరవీలకు అస్కారం లేదని, ఏ ఒక్కరికి ఒక రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని మంత్రి ప్రజలకు వివరించారు. ఎంపిక విషయంలో ఏలాంటి ఒత్తిళ్లకు లోనవ్వకుండా నిజమైన లబ్దిదారులనే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, కోడేరు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పూర్తయిన ధాన్యం సేకరణ

- జిల్లా వ్యాప్తంగా మూసివేసిన కొనుగోలు కేంద్రాలు
- నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- కొనుగోలు చేసింది 2.25 లక్షల మెట్రిక్ టన్నులు
- బోనస్ ఆలస్యంగా ప్రకటించడంతో ప్రైవేటులో విక్రయించిన అన్నదాతలు
- రైతుల ఖాతాలలో రూ.502 కోట్లు జమ

వనపర్తి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యం పెట్టుకోగా 365 కేంద్రాలను ప్రారంభించారు. ఈ సీజన్‌లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం సేకరించారు. ప్రభుత్వం బోనస్ ఆలస్యంగా ప్రకటించడంతో రైతులు ప్రైవేటులో విక్రయించారు. దీంతో లక్ష్యం నెరవేరలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావడం నిలిచిపోవడంతో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.

- వనపర్తి అర్బన్, ఆంధ్రజ్యోతి



వనపర్తి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు

నేటి నుంచి పురపాలికల్లో ప్రత్యేక పాలన

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లకు బాధ్యతలు

మహబూబ్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో పాలక మండళ్ల గడువు ఆదివారంతో ముగిసింది. సోమవారం నుంచి ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు ఇస్తూ, ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఉన్న ఆయా మునిసిపాలిటీలన్నింటికీ అదనపు కలెక్టర్ ఒక్కరికే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఉమ్మడి పాలమూరులో జడ్చర్ల, అచ్చంపేట మునిసిపాలిటీలకు పాలక గడువు ముగియకపోవడంతో అక్కడ పాలన యధావిధిగా సాగనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, భూత్పూర్ మునిసిపాలిటీలకు అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకోనున్నారు. నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి పురపాలికల బాధ్యతలు అదనపు కలెక్టర్‌కు మయాంక్ మిట్టల్ ఇచ్చారు. ఆయన బదిలీపై వెళ్లడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ బాధ్యతలు చూసే అవకాశం ఉంది. ఇక వనపర్తి జిల్లాలో వనపర్తి, ఆత్మకూర్, కొత్తకోట, అమరచింత, పెబ్బేరులకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు బాధ్యతలు ఇచ్చారు. గద్వాల జిల్లాలోని గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్‌లకు గద్వాల అదనపు కలెక్టర్‌గా నియమితులుగా కాగా, ఇప్పటికే అక్కడ ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. దాంతో డీఆర్‌డీవో నర్సింగ్‌రావు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు మునిపాలిటీలకు ఆయనే స్పెషల్ ఆఫీసర్‌గా ఉంటారా? లేదా కలెక్టర్ తీసుకుంటారా? అన్నది తేలాల్సి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తిలకు అదనపు కలెక్టర్ దేవసహాయం స్పెషల్ ఆఫీసర్‌గా ఉండనున్నారు.

గజవాహనంపై అభయుడు

ఊర్కొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో వెలసిన అభయాంజనేయుడు ఆదివారం గజవాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు, ప్రతాలు చేశారు. అభయాంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రెండో రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గజవాహన సేవ, భక్తుల భజనలు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్‌ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం బెక్కరి రాజశేఖర్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కును ఆలయం కార్యనిర్వహణాధికారి, చైర్మన్‌లకు అందజేశారు. ఆలయం సిబ్బంది మారుతిరావు, వరలక్ష్మీ, అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న అభయాంజనేయస్వామి

కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం



వేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో(ఎడమ నుంచి) డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు

(5వ పేజీ తరువాయి)

ఇవ్వడానికి గ్రామాల్లో సభలు పెడుతున్నారని, ఇవ్వడానికి గ్రామాల్లో సభలు పెడుతున్నారని, గందరగోళానికి గురికాకుండా.. అన్ని వివరాలు చెప్పాలని సూచించారు. గత పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని అన్న సీఎం.. పీఆర్ఎల్ఐ పూర్తి కాలేదని, పేట ఎత్తిపోతల పథకం ఊసెత్తలేదని మండిపడ్డారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పథకాలను పూర్తి చేయడానికి పదేళ్లుగా ఎవరు అడ్డుపడ్డారని మండిపడ్డారు. ఈ ప్రాంత బిడ్డగా.. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తనదేనని అన్నారు. ఇప్పటికే ఈ 13 నెలల కాలంలో మహిళలకు ఉచిత బస్సు కోసం రూ.4 వేల కోట్లు, 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రుణమాఫీ కోసం రూ.21 వేల కోట్లు, మొదటి విడత రైతు భరోసాకు రూ.7,625 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పుడు ప్రారంభించిన రైతు భరోసాకు రూ.10 వేల కోట్లు, 10 లక్షల కుటుంబాలకు ఆత్మీయ భరోసా, రూ.22,500 కోట్లతో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామన్నారు. సభలో నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు భేష్..

గణతంత్ర దినోత్సవం రోజు.. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అత్యంత మేలు చేకూర్చే.. ప్రతిష్ఠాత్మక పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని శనివారం సాయంత్రం ఆదేశిస్తే.. అతి తక్కువ సమయంలోనే అధికారులు, ప్రజాప్రతినిధులు అద్భుతంగా చేశారని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇచ్చిన పిలుపుతో కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు వచ్చారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకుని.. కొడంగల్ ఆ ప్రజా ప్రభుత్వానికే ప్రాతినిధ్యం వహించడం 13 నెలలు పూర్తయ్యిందని, తన గడ్డ నుంచే ఈ పథకాలను ప్రారంభించుకోవడం గర్వంగా ఉందని తెలిపారు.

చివరి అర్హుడికి లబ్ధి చేకూరుస్తాం:
శాంతకుమారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే ఒకేరోజు నాలుగు పథకాలను ప్రారంభించుకున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి తెలలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ఆరు గ్యారంటీల అమలుకు కంకణం కట్టుకున్నామన్నారు. మహిళా స్వావలంబన కోసం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఫిబ్రవరి నుంచి పేదలకు కొత్త కార్డుల ద్వారా బియ్యం సరఫరా చేస్తామన్నారు. ఇళ్లు లేని వారికి రూ. ఐదు లక్షలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నామని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అన్నారు. చివరి అర్హుడికీ లబ్ధి చేకూర్చే బాధ్యత ప్రభుత్వానిదేని అన్నారు. ఇప్పటికే ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు 12861, వార్డు సభలు 3487 నిర్వహించి.. అర్హులైన ఎంపిక చేశామని తెలిపారు.

సీఎం చేతుల మీదుగా ప్రొసిడింగ్స్ తీసుకున్న చంద్రవంచ వాసులు

నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం సందర్భంగా చంద్రవంచ గ్రామస్థులకు ఒక్కో పథకానికి ఐదుగురు చొప్పున సీఎం చేతుల మీదుగా ప్రొసిడింగ్స్ తీసుకున్నారు. రైతు భరోసా పథకం కింద రైతులు మల్లయ్య, నర్సింహులు, ఆంజనేయులు, వెంకటమ్మ, భాగ్యమ్మలు గ్రామానికి సంబంధించిన 734 మంది లబ్ధిదారుల తరఫున రూ.9,79,3,350 చెక్కును అందుకున్నారు. ఆత్మీయ భరోసా కింద గ్రామంలో 33 మంది అర్హత సాధించగా.. వారి తరఫున పార్వతమ్మ, నర్సమ్మ, తిరుమలమ్మ, భాగ్యమ్మ, సునీతమ్మ రూ.1.98 లక్షల చెక్కును అందుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామంలో 236 మంది లబ్ధిదారులు ఉండగా.. రూ.11.80 కోట్ల చెక్కును, ప్రొసిడింగ్స్‌ను మంగమ్మ, అనంతమ్మ, వెంకటనర్సమ్మ, మొగులమ్మ, రాములమ్మ అందుకున్నారు. రేషన్ కార్డులకు సంబంధించి 414 ఇళ్లకు గాను 163 దరఖాస్తులు రాగా.. కొత్త కార్డుల ప్రొసిడింగ్స్‌ను వేదవతి, లక్ష్మీ, ఎస్. లక్ష్మీ, రామంజనేయులు, తెలుగు ఆంజనేయులు అందుకున్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం
- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేరుస్తారని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతు భరోసా, రైతు కూలీలకు అండగా ఆత్మీయ భరోసా, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు.

దేశంలోనే రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకొచ్చారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ప్రజాపాలన ఆరు గ్యారెంటీలలో భాగంగా మరో నాలుగు పథకాలను కొడంగల్ నియోజక వర్గంలోని కోస్గి మండలం చంద్రవంచలో ప్రారంభించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

నిరంతర ప్రక్రియ
- డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి



ప్రజాపాలన పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫ్రీ కరెంటు, రూ.500 గ్యాస్ సిలిండర్లు, రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణ మాఫీ చేసి, నేడు మరో నాలుగు పథకాలను ముఖ్యమంత్రి అమలు చేశారన్నారు. ఈ పథకాల అమలుతో నిరుపేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయన్నారు.

పర్యటన సాగిందిలా..

మద్దూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోస్గి మండలం చంద్రవంచ గ్రామ పర్యటన సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 2:26 గంటలకు సీఎం హెలిక్యాప్టర్‌లో వచ్చారు.
- మధ్యాహ్నం 2.32 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 2:34 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- 2.40 గంటలకు సీఎస్ శాంత కుమారి పథకాల అమలుపై వివరణ ఇచ్చారు.
- 2:54 గంటల నుంచి 3:38 గంటల వరకు 43 నిమిషాల పాటు సీఎం ప్రసంగించారు.
- 3:54 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

బీఆర్ఎస్ పాలనలో చేసిందేమీలేదు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్

పదేళ్ల పాటు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ మాటలతో సరిపెట్టారేకాని.. ప్రజలకు చేసిందేమీ లేదు. మారుమూల గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. డబుల్ బెడ్రూంలు ఇవ్వలేదున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలు పేదలకు చేరవేసే క్రమంలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదు. అభివృద్ధిలో వెనుకబడిన కొడంగల్‌ను అన్ని రంగాల్లో ముందుంచడానికి ముఖ్యమంత్రి కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



చంద్రవంచ గ్రామస్థులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కును అందిస్తున్న సీఎం



సీఎం మాట్లాడుతుండగా చప్పట్లు కొడుతున్న ప్రజలు

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందిస్తున్న చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని, ఎవరూ అధైర్య పడవద్దన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, రాములు యాదవ్, గౌని బుచ్చారెడ్డి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డప్పే మొదటి ప్రచార మాధ్యమం
- సీనియర్ మార్క్సిస్టు నాయకుడు అబ్దుల్లాఖాన్



దండోరా కవిగాయక సభలో మాట్లాడుతున్న అబ్దుల్లాఖాన్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో డప్పే మొదటి ప్రచార మాధ్యమమని సీనియర్ మార్క్సిస్టు నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు అబ్దుల్లాఖాన్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో దండోరా కవిగాయక సభ నిర్వహించారు. సామాజిక ఉద్యమకారుడు, కవి ఎదిరెపల్లి కాశన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు పలువురు వక్తలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగ దండోరా, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలు 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, మాదిగలు వారి ఉప కులాలకు న్యాయమైన వాటా పంచడమే సమ్మతమని అభిప్రాయపడ్డారు. కాశన్న మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్తలు దేవదానం, వనపట్ల సుబ్బయ్య, బాలస్వామి, వహీద్‌ఖాన్, దినకర్, తిరుపతయ్య, దేవరాజు, యోగానందం, మల్లయ్య, నాగయ్య, రాజేష్, కృష్ణయ్య, విజయ్‌కాంత్, లక్ష్మణ్, నర్సింహ, కురుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పూర్తి



వనపర్తి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు(ఫైల్)

వనపర్తి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశారు. జిల్లావ్యాప్తంగా 43 వేల మంది రైతుల నుంచి వానాకాలం ధాన్యం 2.25 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి రూ.502 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు. మొదట్లో రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ విషయంలో ఆలస్యం చేయడంతో, చాలా మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ జరగలేదు. రెండు, మూడు సీజన్లుగా అధికారుల లక్ష్యం నెరవేరడం లేదు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యం పెట్టుకోగా 365 కేంద్రాలను ప్రారంభించారు. అందులో ఐకేపీ 192, పీఏసీఎస్ 162, మెప్మా ఆధ్వర్యంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు వానకాలం సీజన్‌కు సంబంధించి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో దాదాపు అన్ని కేంద్రాల్లో కొనుగోలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 2.25 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు.

నెరవేరని లక్ష్యం

ధాన్యం సేకరణలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఈ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం సేకరించారు. ప్రభుత్వం బోనస్ ఆలస్యంగా ప్రకటించడంతో ప్రైవేటులో విక్రయించారు. సన్న రకం ధాన్యం 1.40 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి రైతులకు వారి ఖాతాల్లో రూ.502 కోట్లు జమ అయ్యాయి. ఇంకా రూ.18 కోట్లు జమ కావాల్సి ఉంది. వారికి కూడా 29వ తేదీ వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

బోనస్ పడలేదు

జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్‌కు సంబంధించి 1.40 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని రైతులు విక్రయించారు. సన్న రకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 ప్రకటించింది. ఈ బోనస్ డబ్బులు మొదట్లో ఒక 20 రోజులు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కానీ డిసెంబరు 20వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ డబ్బులు చెల్లించ లేదు. ఇంకా బోనస్ డబ్బులు రూ.40 కోట్లు రైతుల ఖాతాలలో జమచేయాల్సి ఉంది. వీటి కోసం నెల రోజులుగా రైతులు ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు కూడా పూర్తి అయ్యాయని త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఎమ్మెల్యే భూమి పూజ

జడ్చర్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లకు మంజూరైన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులకు ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. పట్టణంలోని వంద పడకల ఆసుపత్రి ఆవరణలో నిర్మించనుండగా, ఇందుకోసం రూ.10 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. క్రిటికల్ కండిషన్‌లో పేషెంట్‌లకు అత్యవసర చికిత్స అందించేందుకు యూనిట్ మంజూరీ అయ్యిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రకళ పాల్గొన్నారు.



జడ్చర్లలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

హిందూ ధర్మ రక్షణకు పాటు పడాలి

భూత్పూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని వికాస్ సీడ్స్ కంపెనీ ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వహిందూ పరిషత్ ప్రఖండ ప్రముఖులకు ఒక్క రోజు శిక్షణ సమావేశానికి లక్ష్మీనారాయణ, జనార్దన్, చంద్రమౌళి, మాతృమండలి నాయకురాలు హేమలతతో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. ఎప్పుడైతే గ్రామాలు, పట్టణాల్లో ధర్మం అనే బీజం ప్రతీ ఒక్కరిలో నాటుకుంటుందో అప్పుడు అరాచకాలు, అసాంఘిక కార్యక్రమాలు, అన్యాయాలు, అక్రమాలు జరగడానికి ఆస్కారం ఉండదన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు మండల ప్రఖండ ప్రముఖ్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మండల అధ్యక్షుడు ప్రభులింగం, నారాయణ పాల్గొన్నారు.



భూత్పూర్‌లో ఒక రోజు శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

అలంపూరు చౌరస్తా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన కమతం రాజు(20), అదే గ్రామానికి చెందిన అభిషేక్ అనే యువకుడితో కలిసి ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌పై ఉండవల్లి వైపు వెళ్తున్నారు. జోగుళాంబ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రాజు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. రాజు తండ్రి కమతం దేవదానం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని విరమించుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ వ్యవసాయ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా నుంచి పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతు సంఘాల పోరాటాలతో వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన జాతీయ వ్యవసాయ ముసాయిదా తీసుకువస్తోందన్నారు. ముసాయిదాను రద్దు చేసి రైతు ఆమోదయోగ్యమైన వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సీ.బాల్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, నాగరాజుగౌడ్, లక్ష్మణ్, సీఐటీయూ రామయ్య, ఎస్ఎఫ్ఐ కార్తీక్, కేవీపీఎస్ అంతటి కాశన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వనపర్తి జిల్లా కేంద్రంలో జాతీయ పతాకంతో చిన్నారుల ప్రదర్శన


వనపర్తి జిల్లా కేంద్రంలో గణతంత్ర వేడుకల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన


జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో అలరించిన చిన్నారుల నృత్యం


నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్ గ్రామంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భళారే..

● అమోఘం.. చిన్నారుల ప్రదర్శన

భళారే.. చిన్నారుల ప్రదర్శన అమోఘం.. అద్వితీయం.. వినూత్న ప్రదర్శనలతో ఆలోచింపజేసేలా చూపరులను తమవైపు తిప్పుకున్నారు. ఆదివారం గణతంత్ర వేడుకల సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ అలరింపజేశారు. వేడుకలకు హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశారు.


జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలపై చిన్నారుల ప్రదర్శన


దాసరి కొండప్ప, కిన్నెర మొగులయ్య, వనజీవి రామయ్య వేషధారణలో దామరగిద్ద రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అబ్బురపరిచిన చిన్నారుల ప్రదర్శన


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆకట్టుకున్న విద్యార్థిని నృత్యం

'పాలన' ప్రత్యేకాధికారుల చేతుల్లోకి..

- నేటి నుంచి మునిసిపాలిటీల్లో అమలు
- 2024 ఫిబ్రవరిలో ముగిసిన సర్పంచుల పదవీకాలం
- గత జూలై నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే మండల, జిల్లా పరిషత్‌లు
- 2025 ఫిబ్రవరి 15తో ముగియనున్న సింగిల్‌విండోల పదవీకాలాలు

అయిజటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిపాలన అంతా ఆదివారం నుంచి ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నటువంటి 19 మునిసిపాలిటీల్లో, అచ్చంపేట, జడ్చర్ల మినహా మిగతా 17 పురపాలికల్లో 2020 జనవరి 27న, పాలకవర్గాలు కొలువు దీరాయి. ఆయా మునిసిపాలిటీల పదవీకాలం 2025 జనవరి 26 (నేటి)తో ముగియనుంది.

ఆయా మునిసిపాలిటీల్లో పరిపాలనా బాధ్యతల నిర్వహణకు గానూ కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించారు. ఈరోజు నుంచి పురపాలికల్లో కూడా వివిధ అభివృద్ధి, ఇతర పనులు కొత్తగా నియమించబడ్డ ప్రత్యేకాధికారులు చేత జరగనున్నాయి.

సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాత గ్రామపంచాయతీలు 1127, నూతనంగా ఏర్పడిన పంచాయతీలు 557 కలిపి మొత్తం 1684 గ్రామపంచాయితీలు ఉన్నాయి. వీటన్నింటికి 2019 ఫిబ్రవరి రెండవ తేదీన పాలకవర్గాలు ఏర్పడగా, 2024 ఫిబ్రవరి ఒకటవ, తేదీన పంచాయతీల పదవీ కాలాలు ముగిశాయి. అప్పటి నుంచి ఏడాది కాలంగా గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తున్నది. గత ఆరు నెలలుగా ఎన్నికలు జరుగతాయనే ప్రచారం జోరందుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన ప్రకటన రాకపోవటంతో ప్రజలు ప్రత్యేకాధికారుల చేతనే పనులు చేయించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 83 జడ్పీటీసీ, 888 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019 జూలై నాలుగవ తేదీన ఎంపీటీసీల సహకారంతో మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటవ్వగా, 2024 జూలై మూడవ తేదీన వాటి పదవీ కాలాలు ముగిశాయి.

2019 జూలై ఐదవ తేదీన జిల్లాపరిషత్ పాలకవర్గాలు ఏర్పడగా, 2024 జూలై నాలుగవ తేదీన వాటి పదవీ కాలాలు కూడా ముగిశాయి. జిల్లా, మండల పరిషత్‌లకు కూడా ఏడు నెలల కాలంగా ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగుతుంది.

20 రోజుల్లో విండోల పదవీకాలం పూర్తి !

ఉమ్మడి మహబూబూబ్‌నగర్ డీసీసీబీ పరిధిలో గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూలు, నారాయణపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లో 78 సింగిల్‌విండో కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో కూడా 2020 ఫిబ్రవరి 16న, పాలకవర్గాలు కొలువుదీరగా 2024 ఫిబ్రవరి 15తో (20రోజులు) పదవీకాలాలు ముగియనున్నాయి. దీంతో సహకార సంఘాల్లో కూడా ప్రత్యేకాధికారుల పాలన తప్పేటట్లు కనిపించటం లేదు.



అలంపూర్ మునిసిపల్ కార్యాలయం



తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రధానంగా గ్రామపంచాయతీలు, మండల పరిషత్తుల్లో కొనసాగుతున్న ప్రత్యేకాధికారుల పాలనతో కిందిస్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతినిత్యం ప్రజలు వారికి, వారి ప్రాంతాలకు అవసరమైన వివిధ రకాల పనులకోసం అధికారుల వద్దకు రావటం, చేయకపోతే వాదులాటలకు దిగటం సర్వసాధారణమైంది. గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఏమిచేయలేని పరిస్థితుల్లో స్థానిక అధికారులు ఉండటంతో, విధులు నిర్వహించలేక తలలు పట్టుకుంటున్నారు. ఏదైనా ముఖ్యమైన పనులు చేయాలన్నా నిధుల సమస్య కూడా వేధిస్తుండటం మరో కారణం. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు, మండల, జిల్లా పరిషత్‌ల్లో వేటికైనా పాలకవర్గాలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్లకు సంబంధించిన నిధులు మంజూరు కావు. గ్రామీణ ఆర్థిక సమస్యలు తీర్చటంలో 15వ ఆర్థికసంఘం నిధులే ప్రధాన పాత్ర పోషిస్తాయి.

ఎన్నికలు నిర్వహిస్తేనే మంచిది



స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితేనే మంచిది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోతున్నాయి. మేము ఓట్లు వేసినా సర్పంచులు, ఎంపీటీసీలను అయితే ధైర్యంగా పనులు చేయమని అడుగుతాం. స్థానిక పంచాయతీ కార్యదర్శిని అడిగితే నిధులు లేవని సమాధానం ఇస్తారు. ఉన్నతాధికారుల అనుమతి కావాలని మరి కొన్నిసార్లు అంటారు.

\- శ్రీనివాసులు, కాలూరు తిమ్మన్‌దొడ్డి, (కేటీదొడ్డి)

మూడు మునిసిపాలిటీలకు ఒక్కడినే



నేను ఇప్పటికే వడ్డేపల్లి మునిసిపాలిటీతో పాటూ అయిజ, అలంపూర్ పురపాలికలకు కూడా ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాను. ఇప్పుడు పాలకవర్గాలు లేకపోతే పనిభారం పడుతుంది. ఈ పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటి నుంచి కార్యాలయాల్లో నిధుల సమస్య కూడా పెరుగుతుంది.

\- రాజయ్య, కమిషనర్, వడ్డేపల్లి

కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు..



సర్పంచుల పదవీ కాలాలు ముగిసి ఏడాది కావస్తుంది. గ్రామపంచాయతీల్లోని అన్ని పనులు కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో అయితే మా సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నా రు. కొన్నిసార్లు కార్యదర్శులు పనులు చేయటం లేదని ప్రజలకు మాకు ఫిర్యాదు చేస్తున్నారు. నిధులు లేనప్పుడు అధికారులు ఎలా పనిచేయాలో అర్థం కాదు.

\- వెంకటయ్య, ఎంపీడీవో, అయిజ

పార్టీ మారినోళ్ల సంగతి ప్రజలే చూసుకుంటారు

- కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ఓడిపోయాం
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం

మహబూబ్‌నగర్/భూత్పూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ బీఫాం తీసుకుని గెలిచి పార్టీ మారినోళ్ల సంగతి ప్రజలే చూసుకుంటారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అది వాళ్ల విజ్ఞతకే వదిలేద్దామని, బీఆర్ఎస్ పార్టీ బీఫాం ఇయ్యాక ముందు సర్పంచ్‌లైనా అయ్యారా? అసలు వాళ్ల గురించి మాట్లాడాల్సిన పనిలేదని ప్రజలన్నీ గమనిస్తున్నారని తెలిపారు. ఆదివారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓటమికి వంద కారణాలున్నాయని బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అని ప్రచారం చేశారని, ఉద్యోగులు ఒకవైపు, దళితబంధు రాలేదని, గిరిజనబంధు రాలేదని ఇలా ఎన్నో కారణాలు ఓటమికి కారణమని చెప్పారు. తాను మహబూబ్‌నగర్‌కు వచ్చేటపుడు ఇక్కడ తెలంగాణవాదం బలంగా లేదని, రకరకాల ప్రచారాలు చేస్తారని, హైదరాబాద్‌లో ఉండాలని చెప్పారని, అవన్నీ తెలిసే తాను పుట్టిన గడ్డను అభివృద్ధి చేసుకోవాలని ఇక్కడికి వచ్చానని గుర్తు చేశారు. పదేళ్లలో పాలమూరులో అభివృద్ధి జరగలేదంటే మనిషే కాదని, అలా అన్నారంటే వాళ్ల కళ్లన్నా కనపడవద్దని, పిచ్చోళ్లన్న అయి ఉండాలని ఎద్దేవా చేశారు. రోడ్డెక్కితే కళ్లముందు వెయ్యి పడకల ఆసుపత్రి, జంక్షన్‌ల సుందరీకరణ, రహదారుల విస్తరణ, మినీ ట్యాంక్‌బండ్, శిల్పారామం, కేసీఆర్ అర్బన్ ఎకోపార్క్, బైపాస్, మెడికల్ కళాశాల, ఐటీ టవర్ ఇవన్నీ కనిపిస్తున్నా అభివృద్ధి జరగలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విచారం వలిబుచ్చారు. పదేళ్ల కింద పాలమూరు పరిస్థితి ఎలా ఉండేది ఇప్పుడెలా ఉందో చూస్తే తెలియదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ పెద్ద ప్రాజెక్టు అయినా అది మహబూబ్‌నగర్‌కు తీసుకువచ్చామని పేర్కొన్నారు.


భూత్పూర్ మునిసిపాలిటీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల

● **కౌన్సిలర్‌లకు సత్కారం**

పాలమూరు పురపాలికకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌ల గడువు పూర్తవడంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్మన్ కొరమోని నర్సింహులు, కౌన్సిలర్‌లు మాట్లాడుతూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గంజి ఎంకన్న, కె.ఆంజనేయులు, గిరిధర్‌రెడ్డి, శివరాజు, తాటి గణేష్, వనజ, అనంతరెడ్డి, రామ్ లక్ష్మణ్, వేద, పటేల్‌ప్రవీణ్, సంధ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నెరవేర్చే వరకు గులాబీ సైన్యం పోరాడుతుంది..

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు గులాబీ సైన్యం పోరాడుతుంటుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ పాలక వర్గం సభ్యుల పదవీ విరమణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పట్టణంలో ఉన్న కేఎంఆర్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో కొత్త మునిసిపాలిటీలను ఏర్పాటు చేసుకున్నామని, ఇందులో భూత్పూర్ మునిసిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా పేరు సంపాదించుకుందని పాలక వర్గ సభ్యులను, చైర్మన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ దేవరకద్ర నియోజవర్గంలో ఏ గ్రామం చూసినా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బ తీసేవిధంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకొనేది లేదన్నారు. చట్టపరంగా శిక్ష పడే విధంగా పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ నాయకులను హెచ్చరించారు.

వార్డు కౌన్సిలర్లు బాల్‌కోటి, శ్రీనివాస్‌రెడ్డి, వసంత, గడ్డం నాగమ్మ, కృష్ణవేణి, రామకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్, అజ్జుభాయ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సురేష్‌కుమార్ గౌడ్, పార్టీ నాయకులు మురళీధర్‌గౌడ్, పాల నర్సిములుగౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మేకల సత్యనారాయణ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలి

- కబడ్డీ గద్వాల జిల్లా అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి


ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్ సభ్యులు

గద్వాల అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సీనియర్ క్రీడాకారులు మంచి ఆటతీరును కనబరిచి జిల్లా అసోసియేషన్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో సీనియర్ కబడ్డీ ఎంపిక పోటీలకు ఆమె హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఏర్పడ్డాక మొదటిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్న జిల్లా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కబడ్డీ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని ఆయా మండలాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 18 మంది క్రీడాకారులను ఎంపిక చేశారని జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కోచ్ క్యాంప్ ఏర్పాటు చేసి ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ అబ్రహాం, బీజేపీ నాయకుడు బండల వెంకట్రాములు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి, సీనియర్ క్రీడాకారులు చందు, రవి, తరుణ్, కరెంటు నరసింహ, పోలీసు వెంకటేష్, నాగేష్, స్రవంతి, జగదీష్, తిరుపతి, రాజశేఖర్, సర్వేశ్వర్ రెడ్డి, శివ, వెంకటన్న ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉరి పెట్టుకుని చట్టముని నాగరాజు(42) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన నాగరాజు కుటుంబ కలహాలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

కోయిలకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని గార్లపాడ్ దొంతన్‌గుండు తండాకు చెందిన సంజీవ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల నాలుగు నుంచి ఎనిమిదవ తేదీ వరకు ఆ దిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాలమూరు జిల్లా జట్టు నుంచి పాల్గొన్నట్లు కోచ్ తెలిపారు. నాయకులు దస్తగిరి, మల్లిఖార్జున్, వెంకట్రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్య... మా పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

పలుమార్లు ఫిర్యాదు చేసినా మీ కాలనీలో సమస్యలు పరిష్కారం కావడం లేదా. అధికారులు స్పందించడం లేదా. కనీస స్పందన కూడా కరువైందా. 'ఆంధ్రజ్యోతి' ఇందుకు వేదిక కానుంది. మీ కాలనీలో దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 28 మంగళవారం రోజు ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు మీ సమస్యలను చెప్పుకోవచ్చు. మునిసిపల్ అధికారులు ఇందుకు మీ సమస్యలకు సమాధానమిస్తారు. ఫోన్ చేయాల్సిన నెంబర్లు 9985410918, 9440454696.

న్యూస్ బాక్స్

29 నుంచి శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో వార్షికోత్సవాలు

కందనూలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర గల శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయం 14వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 29న నుంచి ఫిబ్రవరి 2 వరకు ప్రత్యేకంగా వేడుకలు నిర్వ హిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు ఆకారపు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు తెలిపారు. ప్రతీరోజు అక్షరాభ్యాసాలు, అన్నప్రాశన కార్యక్రమాలు చిన్నారులకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న ప్రత్యేకంగా నవగ్రహ హోమం, గో పద్మవ్రతం, ఈ నెల 31న గాయత్రి హోమం, ఫిబ్రవరి 1న ఉదయం గురుదత్తాత్రేయ హోమం, చండీ హోమం, ఫిబ్రవరి 2న వసం తి పంచమి సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక అక్షర అభ్యాసాలు, విశేషా అక్షరభ్యాసాలు, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు ఉన్నట్లు తెలిపారు. విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తప్పనిసరిగా వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించుకోవాలని అన్నారు.

వృద్ధాశ్రమంలో గణతంత్ర వేడుకలు



కల్వకుర్తిలోని వృద్ధాశ్రమంలో జాతీయ జెండావిష్కరణలో పాల్గొన్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తదితరులు

కల్వకుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని పీబీఎస్, ప్రభుత్వ వృద్ధాశ్రమంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.వెంకటయ్యతో కలిసి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ఆవిష్కరించారు. అంతకు ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటాలకు వారు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమ నిర్వహణకు చేయూతగా నిలుస్తానని ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, దుస్తులను నిర్వాహకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్, ఆంజనేయులు, వృద్ధులు, హోం కో ఆర్డినేటర్ పద్మ, అసిస్టెంట్ హోం కో ఆర్డినేటర్ పరమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థిని బలవన్మరణం

హయత్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొండనాగుల మండలం, అంబరి గ్రామానికి చెందిన ఉడతనూరి సౌమ్య(17) హయత్‌నగర్ కుంట్లూర్ సమీపంలోగల తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్‌లో గత ఏడాది చేరింది. ప్రస్తుతం బైపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారంరాత్రి ఏడు గంటల సమయంలో గదిలో ఉండే వారంతా భోజనం చేయడానికి వెళ్లారు. తర్వాత వస్తానని గదిలోనే ఉన్న సౌమ్య ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. గమనించిన విద్యార్థులు ఆమెను కిందకు దించి వార్డెన్‌కు విషయం చెప్పగా.. వెంటనే అక్కడికి చేరుకొని సౌమ్యను వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్టు నిర్ధారించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు. సౌమ్య గతంలో ఓసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా మరోసారి అలా చేయదని తల్లిదండ్రులు లేఖ రాసి ఇచ్చినట్లు తెలిసింది.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి సన్మానం

దోమలపెంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై స్పందించి సేవాభావంతో పనులు చేస్తున్న దోమలపెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిమ్మన్నను ఆదివారం ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గుద్దేటి లక్ష్మి శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ మాజీ ఎంపీటీసీ తన సొంత ఖర్చులతో పాఠశాలలో తాగు నీరు సమస్య తీర్చేందుకు పైపులైన్ ఏర్పాటు, పాఠశాల ఆవరణంలో ఉన్న గుంతలను పూడ్చించి గ్రౌండ్‌గా మార్చారని తెలిపారు. వారిని మాజీ వార్డు సభ్యుడు పార్థసారథి, కుమార్, ప్రసాద్ అభినందించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

- కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకావిష్కరణ చేసిన అదనపు కలెక్టర్ అమరేందర్
- పలు పార్టీలు, ప్రజా సంఘాల అధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ


గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి / కందనూలు/ బిజినేపల్లి/ మన్ననూర్/ అచ్చంపేట టౌన్/ కొల్లాపూర్/ తెలకపల్లి/ తిమ్మాజిపేట/ అమ్రాబాద్/ దోమలపెంట/ పదర/ చారకొండ/ ఊర్కొండ/ కోడేరు/ పెంట్లవెల్లి/ వంగూరు/ పెద్దకొత్తపల్లి/ ఊర్కొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీలు, సామాజిక సంస్థల కార్యాలయాల వద్ద ఆయా కార్యాలయాల అధికారులు, నాయకులు జాతీయ పతాకావిష్కరణ చేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ తన క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ చేయగా కలెక్టరేట్ వద్ద రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. గాంధీ పార్కు వద్ద మునిసిపల్ చైర్ పర్సన్ కల్పన జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణలో మునిసిపల్ చైర్ పర్సన్ కల్పనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన వేడకల్లో జిల్లా అధ్యక్షుడు జె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో, భరతమాత వేషధారణలతో అలరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. జిల్లా జిల్లా కేంద్రంలోని కొత్త ఎస్పీ ఆఫీస్‌లో ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. యాదవ సంఘం భవనం వద్ద మాజీ ఎమ్మెల్యే గుర్కు జైపాల్‌యాదవ్ జెండాను ఎగురవేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్.శ్రీను, కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు శ్రీదేవి, కావ్య, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో మాధవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఐటీడీఏ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి పీవో రోహిత్ గోపిడి, అటవీ డివిజన్ కార్యాలయంలో ఎఫ్‌డీఓ రామూర్తి, జీసీసీలో మేనేజరు సంతోష్ కుమార్, పీటీజీ వద్ద ప్రిన్సిపల్ గోవర్ధన్, కొల్లాపూర్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి జ్యోత్స్న గుంటి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో భన్సీలాల్, కొల్లాపూర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు ఎల్లేని సుధాకర్ రావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.చారకొండ మండలం మర్రిపల్లి పంచాయతీలోని బోడబండతండాలో తండాకు చెందిన ఆర్మీ వీరజవాన్ మహిపాల్‌నాయక్ విగ్రహానికి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోలు బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. వంగూరు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.

సబ్బండ వర్గాల సహకారంతో ప్రజాపాలన

» 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ బదావత్ సంతోష్

(3వ పేజీ తరువాయి..)

జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 2023-24సంవత్సరంలో 20 రోజుల కంటే ఎక్కువ పని దినాలు కలిగి ఉండి భూమి లేని కుటుంబానికి ఏడాదికి రూ.12వేలు అందించే ప్రక్రియ కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు సంబంధించి కూడా అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపిక చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం 16,006 దరఖాస్తులు వచ్చాయని గ్రామ సభలో ఆమోదం పొందిన తర్వాత వారికి రేషన్‌కార్డు జారీ చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇది నిరంతరమైన ప్రక్రియ అని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 4కోట్ల 26లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని 192 కోట్ల 46లక్షల రూపాయలు ఈ పథకం కింద మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు. కలెక్టర్ గృహజ్యోతి పథకం కింద జిల్లాలో లక్షా 5వేల 391 గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లులు జారీ చేశామన్నారు. రుణమాఫీ కింద రూ. 2లక్షల లోపు రుణాలున్న లక్షా 9వేల 206మంది రైతు లకు 920కోట్ల 63లక్షల రూపాయలు మాఫీ చేసినట్లు తెలిపారు.

ప్రాజెక్టుల్లో పనులు ముమ్మరం

జిల్లాలో మహాత్మాగాంధీ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకు 3లక్షల 7వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ఇప్పటి వరకు 286.5 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం జరిగిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో పనుల పూర్తికి 5వేల 861కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ పథకం కింద అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లో మరో 15వేల ఎకరాలకు సాగునీరందించడానికి పులిజాల నుంచి చంద్ర సాగర్ చెరువు వరకు 15కిలో మీటర్ల బ్రాంచ్ కెనాల్ నిర్మాణం కొరకు 107కోట్ల 20లక్షల రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చిందన్నారు. అచ్చంపేట లిఫ్టు ఇరిగేషన్ స్టేజ్-1 పనులకు తెలకపల్లి, ఉప్పునుంతల, లింగాల, బల్మూరు, అచ్చంపేట మండలాల్లో 61గ్రామాలకు 57వేల 200ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడానికి 1534కోట్ల 50లక్షల అంచనాలతో డీపీఆర్ రూపొందించడం జరిగిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. బిజినేపల్లి మండలంలోని మార్కండేయ ఎత్తిపోతల పథకానికి 76కోట్ల 95 లక్షలతో 7వేల 310ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇటీవల ఒక పంపుకు ట్రయల్ రన్ జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

వెనకబడిన నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యా, వైద్య రంగాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. వైద్యరంగానికి సంబంధించి కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా వైద్య రంగాన్ని విస్తరించగలిగాన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సపై జనానికి నమ్మకం ఏర్పడిందని కలెక్టర్ అన్నారు. గడిచిన సంవత్సరంలో 9,934 కాన్పులు జరగగా వీటిలో 7,411 కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగాయన్నారు. 3,988 సాధారణ కాన్పులు జరగడం గమనార్హమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఎనిమిది స్ర్కీనింగ్ టెస్టులు ఉచితంగా చేయబడుతున్నాయని పేర్కొన్న కలెక్టర్ 108అంబులెన్స్‌ల సంఖ్య ఏడు నుంచి 13కు పెంచామన్నారు. విద్యాపరంగా కూడా జిల్లా పురోగతిని సాధిస్తుందని బదావత్ సంతోష్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ నిర్మించడం ద్వారా విద్యా విప్లవాన్ని తేనున్నామని చెప్పారు. వసతి గృహాలల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచడం ద్వారా విద్యాభివృద్ధి పట్ల ప్రభుత్వం తన నిబద్ధతతను నిరూపించుకుంటుందన్నారు. కుల వృత్తులను కూడా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. పాడిపశువుల పంపిణీ పథకం కింద విజయ డెయిరీకి పాలుపోస్తున్న 5,613 మంది లబ్ధిదారులకు 36కోట్ల రూపాయల సబ్సిడీపై ఆవులు, గేదెల యూనిట్లను మంజూరు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 235 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా ఇందులో 18వేల 389మందికి సభ్యత్వం కల్పించామన్నారు. చెరువు, కుంటలు రిజర్వాయర్లలో వంద శాతం సబ్సిడీపై 81 లక్షల చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన ఎనిమిది మంది మత్స్యకార కుటుంబాలకు రూ.40లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశా మని కలెక్టర్ స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జిల్లా ఫారెస్టు అధికారి రోహిత్‌గోపిడీ, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి


జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, బీఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్


- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అమలుకు నోచుకుని ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ విమర్శించారు. కల్వకుర్తి పట్టణంలో కో ఆప్షన్ సభ్యులు మనోహర్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆదివారంతో పదవీ కాలం ముగుస్తుండడంతో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను మాజీఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, కాటన్‌మిల్లు అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు, కౌన్సిలర్లు సైదులుగౌడ్, కో ఆప్షన్ సభ్యులు మనోహర్‌రెడ్డి, ఖలీల్, నాయకులు చైతన్య, మంజుల, యాదమ్మ, సౌజన్య, షాహేదాబేగం, కిశోర్‌రెడ్డి, మధు, శ్రీను, తాహెర్‌అలీ, భగత్‌సింగ్, శ్రీనివాస్, శ్రీధర్ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

బిజినేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హెచ్‌ఈఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సాయంతో నిర్మించిన భక్తుల వసతి గదులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు అధునిక వసతులతో నూతన గదులను నిర్మించడం హర్షణీయమన్నారు. ఈవో సీహెచ్ రంగారావు, ఆలయ ప్రధాన అర్చకులు రామానుజచార్యులు, కాంగ్రెస్ నాయకులు గోవిందు రామకృష్ణ, చికొంద్ర రాములు, జయకృష్ణ, ఆంజనేయులు, నరేందర్ గౌడ్, శేఖర్ ఉన్నారు.

కొల్లాపూర్ మునిసిపల్ పాలక వర్గానికి ఘన సన్మానం


కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు వీడ్కోలు పలుకుతున్న కమిషనర్ శ్రీనివాసన్

కొల్లాపూర్ ,జనవరి26 (ఆంధ్రజ్యోతి) : నేటితో కొల్లాపూర్ మునిసిపల్ పాలక మండలి సభ్యుల పదవీకాలం ముగియడంతో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకల అనంతరం పట్టణంలోని నూతన గ్రంథాలయ భవనంలో మునిసిపల్ పాలకమండలి సభ్యులకు కమిషనర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. కొల్లాపూర్ మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్యనాగరాజు, వైస్ చైర్‌పర్సన్ మహముదా బేగంతో పాటు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలకు చెందిన మునిసిపల్ కౌన్సిలర్లకు కో ఆప్షన్ సభ్యులకు, మునిసిపల్ కమిషనర్, ఉద్యోగులు, మునిసిపల్ సిబ్బంది శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కమిషనర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ మునిసిపల్ పాలక మండలి సభ్యుల సహకారంతో కొల్లాపూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశామన్నారు. మేకల రమ్య మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్ మునిసిపాలిటీని తీర్చిదిద్దామని పేర్కొన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం

- అడిషనల్ కలెక్టర్ దేవ సహాయం, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి
- ప్రజాపాలన సభల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ


ఊర్కొండ : నర్సంపల్లిలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న అడిషన్ కలెక్టర్ దేవ సహాయం

కందనూలు/ కల్వకుర్తి/ ఊర్కొండ/ వంగూరు/ ఉప్పునుంతల/ తిమ్మాజిపేట/ బిజినేపల్లి/ తెలకపల్లి/ పెంట్లవెల్లి/ చారకొండ/ బల్మూరు/ మన్ననూరు/ పెద్దకొత్తపల్లి/ పదర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి : అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అడిషనల్ కలెక్టర్ దేవసహాయం అన్నారు. ఊర్కొండ మండలం నర్సంపల్లి గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ప్రకటించడంతో మండల అధికారులతో కలిసి ఆదివారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. తహసీల్దార్ రామ్‌కోటి, ఎంపీడీవో కృష్ణయ్య, ఏవో దీప్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ ఉన్నారు. ● నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్ గ్రామంలో జరిగిన సభలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ప్రజలెవరూ అధైర్య పడకూడదని, మన ప్రజాపాలనలో అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు ఉన్నారు. ● వంగూరు మండ లం మిట్టసదగోడులో సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని రేషన్‌కార్డుల, ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ధ్రువ పత్రాలను అందజేశారు. వ్యవ సాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు ఉన్నారు. ● అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఉప్పునుంతలలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇల్లును ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, ఆర్డీవో మాధవి పాల్గొన్నారు. ● కల్వకుర్తి మండలం రఘుపతిపేటలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న నాలుగు పథకాలను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం శాలువాల, పూల మాలలతో సత్కరించారు. ● తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభలో తిమ్మాజిపేట మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డుల ధ్రువపత్రాలు అందజేశారు. ● బిజినేపల్లి మండలం అల్లీపూర్ గ్రామంలో ఆది వారం మండల ప్రత్యేక అధికారి రాజేశ్వరి అధ్య క్షతన జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి లబ్ధిదారులకు వివిధ పథకాల ప్రొసీడింగ్స్ అందజేసి మాట్లాడారు. ● తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి రాంలాల్ వివిధ పథకాల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రా లు అందజేశారు. ● పెంట్లవెల్లి మండలం యం గంపల్లితండాలో ఎంపీడీవో దేవేందర్, తహసీల్దార్ జయంతి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పథకాల ధ్రువ పత్రాలను అందజేశారు. ● చారకొండ మండలం గోకారం గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాలను డీసీవో, చారకొండ మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. ● బల్మూరు మండలం జినుకుంట గ్రామంలో నాలుగు పథకల లబ్ధిదారులకు డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్ ప్రొసీడింగ్‌లు అందజేశారు. ● అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రా మంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రజని పాల్గొని సంక్షేమ పథకాల ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ● పెద్దకొత్తపల్లి మండలం చంద్రబండతండాలో రైతు భరోసా 20, ఇందిరమ్మ ఇళ్లు 35, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 9, భూమి లేని కూలీలకు ఏడాదికి 12వేల పథకం ద్వారా 11మందికి మంజూరు పత్రాలను మం డల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రాజేశ్వరి పంపిణీ చేశారు. ● పదర మండలం గానుగుపెంటలో జరిగిన గ్రామ సభలో ప్రత్యేక అధికారి ఫిరంగి వివిధ పథకాల లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.


ఉప్పునంతలలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్, బదావత్ సంతోష్


లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి


కల్వకుర్తి : రఘుపతిపేటలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు


బల్మూరు : జినుకుంట గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువపత్రం అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్